నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏటీఈ శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్న తోకట్ట సబ్‌స్టేషన్ సెంట్రల్ ఎక్సైజ్, దుబాయ్ గేట్ ఫీడర్ పరిధిలో మారుతీనగర్, సాయిబాబా టెంపుల్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, వైష్ణవి మాతా టెంపుల్, స్పెన్సర్స్, దుబాయ్ గేట్ తదితర ప్రాంతాలు, హెచ్‌ఈఎల్ సబ్‌స్టేషన్ సౌభాగ్యనగర్ ఫీడర్ పరిధిలో శ్రీరామ ఇండస్ట్రీస్, ఉషా కంపెనీ, డ్యూలక్స్ పెయింట్, డీమార్ట్, ప్రాగా టూల్స్ సబ్‌స్టేషన్ ఇండో స్వింగ్ పరిధిలో ఏపీహెచ్‌బీ కాలనీ మెయిన్ రోడ్డు, సీఐఈ గాంధీనగర్, గిరినగర్, గురుమూర్తినగర్, గాంధీనగర్ ఇండస్ట్రియల్ ఏరియా, ఏపీహెచ్‌బీ కాలనీ, ఇందిరాగాంధీనగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిజాంపేట్ : మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శుక్రవారం విద్యుత్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ గోకరాజు రంగరాజు ఫీడర్‌లో సాయంత్రం 4:30 గంటల నుంచి 5 గంటల వరకు గోకరాజు కాలేజ్ రోడ్డులో, 11కేవీ లక్ష్మీ నగర్ ఫీడర్‌లో 3 నుంచి 5 గంటల వరకు లక్ష్మీనగర్, దోవా కాలనీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రోడ్డు, 11కేవీ గౌతమి నగర్ ఫీడర్‌లో సాయంత్రం 5 గంటల నుంచి 5:30 గంటల వరకు లేక్‌వ్యూ కాలనీ, శ్రీనివాస్ కాలనీ, శుభోదయ కాలనీ, 11కేవీ కేంద్రీయ విహార్ ఫీడర్‌లో సాయంత్రం 3 నుంచి 3:30 గంటల వరకు కేంద్రీయ విహార్ ప్రాంతం, రత్నదీప్ వెనుకవైపు, 11కేవీ నందమూరి నగర్ ఫీడర్‌లో హోలిస్టిక్ హాస్పిటల్, నిజాంపేట్ ప్రధాన రహదారి, 11కేవీ 7 హిల్స్ ఫీడర్‌లో నాగార్జున గృహాలు, 7 హిల్స్ అపార్ట్‌మెంట్, 11కేవీ ప్రశాంతి కొండ నుంచి అల్లాపూర్ సొసైటీ ఫీడర్‌లో అల్లాపూర్ సొసైటీ ఉదయం 9 నుంచి 11గంటల వరకు పై ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం జరిగింది. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు హాజరయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు.

సత్యవాణి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్‌తో చిన్నారులు

జీడిమెట్ల: చిన్నారులు ప్రైమరీ తరగతుల నుంచే క్రమశిక్షణతో చదవాలని టీవీఆర్ మోడల్ స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లోని సత్యవాణి పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరమంతా కృత్రిమ మేధస్సుదే..

సాక్షి, సిటీబ్యూరో: నేటి ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్ పైన అవగాహన పెంచుకోవడం తప్పనిసరి అని, భవిష్యత్‌ను నడిపించేది ఈ వినూత్న ఆవిష్కరణలేనని జేఎన్‌టీయూ హైదరాబాద్ మాజీ వైస్-చాన్స్‌లర్ ప్రొ.డీ.ఎన్.రెడ్డి తెలిపారు. నగరంలోని గోకరాజు లైలావతి ఇంజినీరింగ్ కళాశాల 4వ వార్షిక వేడుకలను శుక్రవారం బాచుపల్లిలోని జీఎల్‌ఈసీ క్యాంపస్ వేదికగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొ.డీ.ఎన్.రెడ్డి హాజరై విద్యార్థులకు అధునాతన సాంకేతిక, భవిష్యత్ ప్రణాళికల పై అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యా, క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జీఆర్‌ఐఈటీ డైరెక్టర్ డాక్టర్ జంధ్యాల నారాయణ మూర్తి, జీఎల్‌ఈసీ ప్రిన్సిపాల్ డా.ఏ.సాయి హనుమాన్, డా.కేవీఎస్, రిజిస్ట్రార్ రాజు, ప్రొ.పద్మాలయ నాయక్, డాక్టర్ జె. కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సారు లేక.. పనులు సాగక!

● మూడు నెలలుగా సెలవుల్లో కుత్బుల్లాపూర్ తహసీల్దార్
● ఇన్‌చార్జీగా కొనసాగుతున్న కూకట్‌పల్లి తహసీల్దార్ ● పనిభారంతో ఆలస్యమవుతున్న పనులు

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సారు లేక అస్తవ్యస్తంగా మారింది. మండలానికి మెజిస్ట్రేట్ అయిన తహసీల్దార్ మూడు నెలల నుంచి సెలవుపై వెళ్లారు. ఇన్‌చార్జీగా కూకట్‌పల్లి తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు ప్రాంతాల్లో పని ఒత్తిడితో సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పట్టాదారు, పాసుపుస్తకాలు, సర్వేలు, ధ్రువీకరణ పత్రాల జారీలో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగాల్సి వస్తోంది.



కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయం వద్ద వేచి ఉన్న జనం

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రెహమాన్‌ఖాన్ జనవరి నుంచి మార్చి 31 వరకు మూడు నెలల పాటు సెలవుపై వెళ్లారు. దీంతో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కూకట్‌పల్లి తహసీల్దార్ స్వామిని నియమించారు. మార్చి 31తో అతని సెలవులు అయిపోయి 4 రోజులు గడుస్తున్నా విధుల్లోకి రాలేదు. ఇంకా సెలవును పొడిగించుకుంటారా?, వస్తారా? అనేది తెలియడం లేదు.

నిత్యం రద్దీ..

ఈ మండలంలో రెండు సర్కిళ్లకు గాను 8 డివిజన్లు ఉన్నాయి. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ జనాభా ఉండే కుత్బుల్లాపూర్ మండలంలో వివిధ పనుల నిమిత్తం ప్రతి రోజు కార్యాలయానికి పెద్ద సంఖ్యలో జనాలు వస్తుంటారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారి ఏ ఫైల్ అయినా కింది స్థాయి నుంచి తహసీల్దార్ వరకు వెళ్లాల్సి ఉంటుంది. మూడు నెలల నుంచి కింది స్థాయి నుంచి డిప్యూటీ తహసీల్దార్ వరకు వేగవంతంగా ఫైల్ వెళ్లినా.. అనంతరం రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో ప్రతి పనిలో రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన యువ వికాస పథకంలో భాగంగా పది రోజుల నుంచి కుల, ఆదాయ ధ్రువ పత్రాల నిమిత్తం మండలంలోని యువత పెద్ద సంఖ్యలో వస్తున్నారు. సాధారణ రోజుల్లో 100 వచ్చే దరఖాస్తులు కొన్ని రోజులుగా 1000కి పైగా వస్తున్నాయి. తహసీల్దార్ సంతకం నిమిత్తం కూకట్‌పల్లికి తీసుకెళ్లడం, అక్కడ ఒక్కోసారి సర్వర్ డౌన్ అవ్వడం, అక్కడి ఫైల్ అయిపోయిన తర్వాత ఇక్కడి ఫైళ్లను చూసుకోవడంతో చాలా జాప్యం ఏర్పడుతుంది. దీంతో దరఖాస్తు చేసిన వారి పనులు సకాలంలో పూర్తికాక కార్యాలయం చుట్టూ కాలు అరిగేలా తిరుగుతున్నారు.

పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం



కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కూకట్‌పల్లి తహసీల్దార్‌ను నియమించాము. ఇంకా విధుల్లోకి రాలేదు. సమస్యను ఇటీవలే కలెక్టర్‌తో ప్రస్తావించాం. ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా పది రోజుల్లో మరో తహసీల్దార్‌ను త్వరలోనే నియమించనున్నాం.

– శ్యామ్‌ప్రకాష్, ఆర్డీవో మల్కాజిగిరి.

శ్రీరామ నవమి వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

డీసీపీ సురేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సురేష్ కుమార్

నిజాంపేట్ : ప్రశాంత వాతావరణంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించాలని డీసీపీ సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామ నవమి పండుగ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులు తోపులాటలకు గురికాకుండా క్యూ పద్ధతి పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, బాచుపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

● నిలిచిన విద్యుత్ సరఫరా ● మరమ్మతులు చేసిన సిబ్బంది



ట్రాన్స్‌ఫార్మర్‌పై మంటలు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

జగద్గిరిగుట్ట: 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగడంతో సుమారు 18 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని సోమయ్యనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో చుట్టు పక్కల బస్తీలు అన్ని చీకటిమయంగా మారాయి. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేయడంతో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు సమస్య పరిష్కారమైంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన కేబుల్ పాడవడంతో ఈ సమస్య వచ్చిందని, నూతన కేబుల్ లైన్ వేయడానికి సమయం పట్టిందని సబ్ స్టేషన్ ఏఈ రాధాకృష్ణ తెలిపారు.

రాజ్యాంగ ప్రాధాన్యతను వివరించాలి



పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

జగద్గిరిగుట్ట: రాజ్యాంగం ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్‌లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గాంధీ, బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాలతో పలు బస్తీలలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తుందన్నారు. రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, కృష్ణ గౌడ్, రషీద్, ఐలయ్య గౌడ్, మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ , స్వాతి, నరేష్ గౌడ్, నరేందర్ రెడ్డి, రవి కుమార్, తిరుమలరెడ్డి, జనార్దన్, కౌసల్య, చంద్రకళ, సాయి, ప్రవీణ్, అనిత, డివిజన్, మండల, బూత్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నిజాంపేట్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌లలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. బీజేపీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో సుధీర్‌రెడ్డి, కొలన్ వీరేందర్‌రెడ్డి, చిట్ల దివాకర్, రఫియా బేగం, కడియాల ఇందిరా, శ్రీనివాస్‌రెడ్డి, చౌదరి, అరవింద్, ప్రవీణ్‌రెడ్డి, జీవన్ రెడ్డి, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

సమస్యల పరిష్కారానికి కృషి

జగద్గిరిగుట్ట : సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని కార్పొరేటర్ జగన్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని జగద్గిరినగర్‌లో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో మల్లేష్ గౌడ్, పాపిరెడ్డి, బొగ్గుల సురేష్, తమ్మయ్య రమేష్, నటరాజ్, ఇంద్ర గౌడ్, వరలక్ష్మి, జ్యోతి, బస్తీ వాసులు పాల్గొన్నారు.

నేడు ఫార్మా విదార్థులకు ఇంటర్వ్యూలు

చింతల్: జోడాస్ ఎక్స్‌పిమ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఫార్మా రంగంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫార్మా రంగంలో ఎఫ్ఆర్ అండ్ డీ, ప్రొడక్షన్, మైక్రో బయాలజీ, ప్యాకింగ్, క్వాలిటీ కంట్రోల్, మెయింటెనెన్స్ (మెకానికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్) ఆయా విభాగాలకు సంబంధించి రెండు సంవత్సరాల నుంచి పది సంవత్సరాల మధ్యలో అర్హత గల అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ వాక్ ఇన్ ఇంటర్వ్యూ కార్యక్రమం ఐడీపీఎల్ చౌరస్తాలోని భాగ్యరథి డిగ్రీ కళాశాల మొదటి అంతస్తులో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9010127054 కు సంప్రదించాలని పేర్కొన్నారు.

హర్ష టయోటా మెగా కార్నివాల్ సేల్స్



మెగా కార్నివాల్ సేల్స్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు గాదె శివ చౌదరి, సంస్థ ప్రతినిధులు

కూకట్‌పల్లి: ప్రగతినగర్‌లో శుక్రవారం హర్ష టయోటా మెగా కార్నివాల్ సేల్స్‌ను కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు గాదె శివ చౌదరి, హర్ష టయోటా వైస్ ప్రెసిడెంట్ స్వామి, ఆంధ్ర, తెలంగాణ టయోటా న్యూ కార్స్ హెడ్ ప్రశాంత్, మార్కెటింగ్ హెడ్ సుమంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. మార్కెట్‌లో టయోటా బ్రాండ్ కస్టమర్ల మన్ననలు పొంది ఉందన్నారు. ఈ కార్లు కొనుగోలు చేయటం వల్ల కస్టమర్ పెట్టిన ప్రతి రూపాయి తిరిగి కారు అమ్ముకునేటప్పుడు పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆదివారం వరకు మల్టీ బ్రాండెడ్ యూజ్డ్ (వాడిన) కార్లు అందుబాటులో ఉంటాయన్నారు. మూడు రోజుల పాటు ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శకులకు అనుమతిస్తామని తెలిపారు. ఈ సమయంలో వాహనం బుక్ చేసుకున్న వారికి ఒక గ్రాము బంగారు కాయిన్ గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవింద్ గౌడ్, రమణ, చందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

కూకట్‌పల్లి: మధుకర్ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాలలో సర్వ పవన్ సమక్షంలో బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, జిల్లా అధికార ప్రతినిధి తోట రమేష్ శుక్రవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, విఠల్, నాయకులు రేవతి, శ్రీనివాస్ రెడ్డి, వినోద్, గోపి, సూరిబాబు, వెంకటరమణ, జగదీష్, గుడిమెట్ల సాయి, జగన్, తోట ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా పసుపు కొట్టే కార్యక్రమం



పసుపు దంచుతున్న మహిళలు

శ్రీరామనవమి కల్యాణ మహోత్సవంలో భాగంగా హరితవనం కాలనీలో శుక్రవారం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. కార్పొరేటర్ విజయలక్ష్మీ సుబ్బారావు ఆధ్వర్యంలో పందిరి ఏర్పాటు చేసి పసుపు కొట్టే కార్యక్రమాన్ని కాలనీ మహిళలతో కలిసి ప్రారంభించారు.

– నిజాంపేట్

సత్తాచాటిన ఎంఎల్ఆర్ఐటీ విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, అధ్యాపకులు

దుండిగల్: చెన్నై వేదికగా నిర్వహించిన జాతీయస్థాయి డ్రోన్ టెక్నాలజీ పోటీల్లో దుండిగల్‌కు చెందిన ఎంఎల్ఆర్ఐటీ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎస్ఏఈ ఇండియా సదరన్ విభాగం నిర్వహించిన ప్రతిష్టాత్మక డ్రోన్ డెవలప్‌మెంట్ పోటీల్లో రెగ్యులర్ విభాగంలో ఎంఎల్ఆర్ఐటీ కళాశాలకు చెందిన విద్యార్థి యశస్వి నాయకత్వంలో పాల్గొన్న జటాయు బృందం ద్వితీయ బహుమతిని సాధించి రూ.45 వేల నగదును గెలుచుకుంది. అదే విధంగా మైక్రో కేటగిరీలో వినయ్ తేజ నాయకత్వంలోని టీం అయోలస్, ఏరోడైనమిక్ విశ్లేషణ (సీఎఫ్‌డీ)తో ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. ఎస్.కీర్తన నేతృత్వంలోని టీమ్ ఆస్ట్రా, సంక్లిష్ట ఇంజనీరింగ్ సవాళ్లను పరిష్కరించడంలో వినూత్న విధానాన్ని ప్రదర్శించి ఉత్తమ ఆవిష్కరణ విభాగంలో తృతీయ బహుమతిని గెలుచుకుంది. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కే. శ్రీనివాస్‌రావు, డీన్ రాధికాదేవి, ఏరోనాటికల్ విభాగం అధిపతి డాక్టర్ గుప్తా విద్యార్థులను అభినందించారు.

ప్రాథమిక పాఠశాలలో వీడ్కోలు సమావేశం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

నిజాంపేట్ : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రగతినగర్ 4వ తరగతి విద్యార్థులు 5వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథులుగా హెచ్‌ఎం లక్ష్మీ నర్సిములు, బాచుపల్లి ఎంఈఓ ఎంవీవీ రామకృష్ణ, జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మల్లయ్యచారి, పీఆర్టీయూ టీఎస్ బాచుపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నర్సిములు మాలి ప్రమోద్ కుమార్‌రెడ్డి హాజరయ్యారు. వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

రహదారులపై అడ్డుగోడలను తొలగించిన హైడ్రా

ఫైనాన్స్ కార్పొరేషన్ భూమికి మార్గం సుగమం

సాక్షి, సిటీబ్యూరో: కుత్బుల్లాపూర్ మండలం సూరారం గ్రామంలో రహదారులకు ఆటంకంగా నిర్మించిన ప్రహరీలను హైడ్రా శుక్రవారం తొలగించింది. ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ తెలంగాణ డివిజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఈ మేరకు హైడ్రా చర్యలు తీసుకుంది. ఓ పారిశ్రామిక యూనిట్ పెట్టడానికి ఏపీఎస్ఎఫ్ వద్ద తనకున్న 1.26 ఎకరాల భూమిని చూపించి వర్ల రాజేశ్వర రావు అనే వ్యక్తి 2010 లోన్ తీసుకున్నారు. ఆ లోన్ చెల్లించకపోవడంతో భూమి స్వాధీనానికి వెళ్లిన ఫైనాన్స్ కార్పొరేషన్కు ఆటంకాలు ఎదురయ్యాయి. గతంలో ఆ భూమికి చూపించిన మార్గాలను మూసేయడంతో ఆ సంస్థ హైడ్రాను ఆశ్రయించింది. దారులకు అడ్డగా నిర్మించిన ప్రహరీని హైడ్రా కూల్చివేయడంతో మార్గం లభించింది.